
# అమృతం కురిసింది

-గంటా కళ్యాణీనాయుడు



మార్నింగ్ వాక్ చేసొచ్చి విశ్రాంతిగా హాల్లో వున్న సోఫాలో కూర్చున్నాను. సమయం ఏడు గంటలు కావస్తోంది. రోజూ ఈపాటికి టీ కప్పుతో ఎదురొచ్చే నా శ్రీమతి సంధ్య ఈ రోజు జాడ లేదు.

పూజ గదిలో నుండి గంట శబ్దంతోపాటు గంధం, కర్పూరం కలగలిపిన పరిమళం నా ముక్కుపుటల్ని సోకింది. సంధ్యకింకా పూజా కార్యక్రమం పూర్తవ్వలేనట్టుగా ఉంది. ఉదయాన్నే టీ తాగందే బండి నడవదు. బిజినెస్‌లో పది లక్షలు నష్టం వచ్చినా పెద్ద ఇబ్బంది పడనేమో గానీ, సమయానికి టీ పడకపోతే మాత్రం ఇబ్బందే! టీ రావడానికి ఇంకా సమయం పట్టొచ్చనుకొని టైంపాస్ కోసం టీవీ ఆన్ చేశాను. షరా మామూలే. ఏ ఛానల్ చూసినా గత రెండు రోజులుగా ఊదరగొడ్తున్న అవే వార్తలు రిపీట్ అవుతూనే కన్పిస్తున్నాయి.

హత్యలు, ఆత్మహత్యలు, కిడ్నాప్‌లు, అంతకుమించి స్వార్థ రాజకీయపు వేర్పాటువాదాలు!

పదవులు దక్కని నాయకులంతా ఒక జట్టుగా, రాజకీయ భవిష్యత్తు ముగింపు దశకొచ్చిన వృద్ధ నేతలంతా ఒక జట్టుగా 'రాష్ట్రాన్ని చీల్చేద్దాం...!' అంటూ తమతమ ఉనికిని కాపాడుకోవటం కోసం నినాదాలు చేస్తూ ప్రజల్ని రెచ్చగొట్టే పనిలో పడ్డారు.

అవే వార్తల్ని చూస్తూ కూర్చొంటే బుర్ర అదుపు తప్పే ప్రమాదముందని గ్రహించి టీవీ కట్టేసి ప్రశాంతంగా కళ్ళు మూసుకొని సోఫాలో వెనుకకు జారబడ్డాను.

కొంత సమయం జరిగిన తర్వాత 'గుడ్‌మార్నింగ్ డాడీ...' అంటూ తియ్యని పిలుపు వినిపించడంతో కళ్ళు తెరిచి చూశాను. నాకెదురుగా నా ఒక్కగానొక్క కూతురు అమృత నవ్వుతూ టీ కప్పుతో నుంచొని ఉంది.

అమృత ముఖంలో ఎప్పుడూ నవ్వు తొణికిసలాడుతూనే ఉంటుంది. ఆ నవ్వు పున్నమినాటి జాబిల్లి కురిపిస్తున్న వెన్నెలంత హాయిగా ఉంటుంది. అంతవరకూ అస్తవ్యస్తంగా ఉన్న నా మనస్సు ఆ నవ్వుతో తెరిపిన పడ్డది. బదులుగా నేను కూడా నవ్వుతూ 'వెరీగుడ్‌మార్నింగ్ మైడియర్ మమ్మీ' అంటూ పలకరించి టీ కప్పు అందుకున్నాను.

అమృతని 'మమ్మీ' అంటూ పలకరించటం నాకు అలవాటు. ఎందుకంటే అమ్మ కాలంచేసిన మర్నాడే అమృత పుట్టింది. అందుకే, అమ్మ పేరే అమృతకి పెట్టుకున్నాను. అచ్చం అమ్మ పోలికల్తో అమృత పుట్టడం నాకు మరింత ఆనందమైన విషయం.

నా ఆలోచనలకి అడ్డుపడ్తూ 'ఏంటి డాడీ ఆలోచిస్తున్నారు' అంది. 'అబ్బే ఏం లేదురా' అని నేను టీ తాగిన తర్వాత 'మమ్మీ... వచ్చే సోమవారమే కదా నీ పుట్టిన రోజు' అన్నాను. అవునన్నట్టుగా తల ఊపింది అమృత. 'పార్టీ ఎరేంజ్ చేస్తానంటే ఆలోచించి చెప్తానన్నావ్. గుర్తుందా' అన్నాను. నా మాటలకి సమాధానంగా 'ప్లీజ్ డాడీ! అటువంటి సెలెబ్రేషన్స్ నాకిష్టముండదని మీకు తెలుసు కదా' అంది.

నేను ఊహించిన సమాధానమే అది.

అమృత ఈ కాలంనాటి పిల్లలా అన్పించదు. తన ఫ్రెండ్స్ అందరూ పబ్‌లు, పార్టీలు, డిస్కోథెక్‌లు అంటూ రాకెట్ వేగంతో మోడరన్ కల్చర్ వైపు దూసుకుపోతుంటే, తాను మాత్రం వాటిపట్ల అయిష్టతను చూపుతూ తల్లిచాటు పిల్లలా ఉంటుంది.

ఉదయాన్నే కాలేజీకి వెళ్ళడం, కాలేజీ కాగానే ఇంటికి రావడం, ఇంటికొచ్చిన తర్వాత వంటగదిలో వాళ్ళమ్మకు సహాయపడటం. ఇదే తన దినచర్య. సినిమాకైనా షికారుకైనా నేను తీసుకెళ్తేనే వస్తుంది. తన కట్టూబొట్టూ విషయంలో కూడా అంతే. అచ్చ తెనుగు అమ్మాయిలా లంగా వోణీ, తప్పితే పంజాబీ డ్రెస్‌తో చాలా సింపుల్‌గా ఉంటుంది.

అమ్మ పోలికలే కాదు అమ్మకాలంనాటి ఆచార వ్యవహారాల్ని కూడా పుణికి పుచ్చుకున్నట్టుగా అన్పిస్తుంది. శిథిలమైపోతున్న మన సంస్కృతికి ఆనవాళ్ళు నా కూతురు అమృత అంటే అతిశయోక్తి కాదేమో!

నా ఆలోచనల్ని కట్టిపెట్టి ఏమైనా సరే అమృతని బర్త్‌డే పార్టీకి ఒప్పించాలనుకున్నాను. 'మమ్మీ... ఇలా కూర్చోరా!' అన్నాను ముద్దుగా. నవ్వుతూ వచ్చి నా పక్కనే కూర్చుంది. తన చేయిని నా చేతుల్లోకి తీసుకొని 'చూడు అమృత... నేను అహర్నిశలు శ్రమించి ఆర్జిస్తున్న ఈ సంపాదనంతా మనం అనుభవించడానికే కదా!' అన్నాను. అవునన్నట్టుగా తల ఊపింది అమృత. 'ఒక వయసులో ఉన్న ఆనందం వయసు మళ్ళిన తర్వాత రమ్మన్నా రాదు. ఈ సొసైటీలో మనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. మన తాహతుకి తగ్గట్టుగా మనం మసలుకోవాలి. లేదంటే నలుగురికీ అలుసైపోతాం' అని రెండు క్షణాల తర్వాత మళ్ళీ అన్నాను 'ఏ సంవత్సరానికా సంవత్సరం ఏదో ఒకటి చెప్పి దాటవేస్తున్నావ్! కానీ ఈ సంవత్సరం మాత్రం నా కోసం, నా ఆనందం కోసం నువ్వు బర్త్‌డే పార్టీకి ఒప్పుకోవాలి' అన్నాను.

నా మాట వినగానే అమృత ముఖ కవళికలు మారిపోయినయ్. తనని ఇబ్బంది పెడ్తున్నానేమో అన్పించింది. అమృత ఆలోచనల్లో పడింది. రెండు నిమిషాలు ఆలోచించిన తర్వాత 'డాడీ... మీరు చెప్పినట్టే పార్టీకి ఒప్పుకొంటున్నాను. కానీ, మీరనుకున్నంత గ్రాండ్‌గా పార్టీ వద్దు. సింపుల్‌గా మా ఫ్రెండ్స్‌కి మాత్రమే పార్టీ ఇస్తాను' అని తన అభిప్రాయం చెప్పింది.

కొంతలో కొంత నా ప్రయత్నం ఫలించినందుకు, అమృతలో ఆ మాత్రం మార్పు తీసుకొచ్చినందుకు నన్ను నేను లోలోపల అభినందించుకొని వెంటనే లక్ష రూపాయలకు చెక్కు రాసి ఇచ్చాను. అమృత ఆ చెక్‌ని అందుకుంటూ 'డాడీ... ఆ పార్టీకి మీరు కూడా రావాలి' అంది. 'తప్పకుండా వస్తా! ఆ రోజంతా ఎంజాయ్ చేద్దాం. సరేనా!' అన్నాను ఉత్సాహంగా. 'థాంక్యూ డాడీ...' అంటూ అమృత నన్ను ఆనందగా చుట్టేసుకుపోయింది.

ఈలోపు బయట మా వాచ్‌మేన్ రంగయ్య కేకలు వినపడటంతో విషయం అర్థంకాక వడివడిగా బయటకు నడిచాను. నా వెనకే అమృత కూడా వచ్చింది.

గేటు బయట నడివయస్సు స్త్రీ, ఆమె పక్కనే చిన్నపిల్లోడు నుంచొని ఉన్నారు. ఆ పిల్లోడికి ఐదు సంవత్సరాలుండొచ్చు. దుమ్ము కొట్టుకుపోయిన శరీరం, చిరిగిపోయిన బట్టలు, సరైన తిండిలేక బక్కచిక్కిన వాళ్ళ ఆకారాల్ని చూసేసరికి నా మనసు ద్రవించింది. దారిద్ర్యానికి నిలువుటద్దంలా ఉన్నారు వాళ్ళు. లోపలికి రావడానికి ప్రయత్నిస్తున్న వాళ్ళని రంగయ్య 'ఏయ్... చెప్తే వినబడటం లేదా? పొండి!' అంటూ గద్దిస్తున్నాడు. వాళ్ళు కదలటంలేదు. రంగయ్యలో సహనం చచ్చిపోయింది. చెయ్యెత్తి వాళ్ళని కొట్టబోయాడు. జరగబోయే ప్రమాదాన్ని ఊహించి నేను వెంటనే స్పందించాను. 'రంగయ్య... వాళ్ళని లోపలికి పంపు' అంటూ కేకేశాను. వాళ్ళిద్దరూ లోపలికి వచ్చి నాకు ఎంతో వినయంగా దణ్ణం పెట్టారు.

'బాబూ... దండాలయ్యా! వీడు నా కొడుకు. జబ్బు చేసి ప్రాణాలు అరచేతిలో పెట్టుకు బతుకుతున్నాడు. పెద్దాసుపత్రిలో పరీక్ష చేయిస్తే, ఊపిరితిత్తులలో చిల్లు పడిందన్నారు. ఈ జబ్బు మందులతో తగ్గేది కాదూ ఆపరేషన్ చేయాలి, దానికి యాభై వేల దాకా ఖర్చవ్వద్దన్నారు. పుట్టెరిగి అంత డబ్బు ఎప్పుడూ చూళ్ళేదు. రెండ్రోజుల్లో ఆపరేషన్ చేయకపోతే వాడి ప్రాణానికే

ముప్పని చెప్పారయ్యా డాక్టర్లు' అని ధారాపాతంగా కారుతోన్న కన్నీటిని పమిట కొంగుతో తుడుచుకొని ఆ పిల్లోణ్ణి తన దగ్గరకు లాక్కొని వాడి జుట్టు నిమురుతూ 'ఈ లోకంలో నాకు మిగిలింది వీడొక్కడేనయ్యా. వీడి నాన్న సంవత్సరం క్రితమే ప్రమాదంలో చనిపోయాడు. నేనెరిగి మాకు సహాయపడే బంధువులెవరూ ఈ భూమ్మీద లేరయ్యా. మీలాంటి మహానుభావులంతా దయతలచి సాయం చేస్తే వీడు నాకు దక్కుతాడు' అంటూ ఏడుస్తూ తన బాధనంతా వెళ్లబుచ్చి, ప్రాధేయ పూర్వకంగా నా కాళ్లపై పడబోయింది.

నేను ఆమెను వారించి, ఆ పిల్లోణ్ణి పరిశీలనగా చూశాను.

వాడికి ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంది. ఆయాస పడిపోతున్నాడు. దగ్గు వాణ్ణి నిలవనీయడం లేదు. నన్ను గమనించిన వాడు నాకు రెండు చేతుల్తో దణ్ణం పెట్టి 'నన్ను బతికించండయ్యా..' అన్నట్టుగా నా వైపు దీనంగా చూస్తున్నాడు.

ఆ దృశ్యంతో నా మనసు నీరయింది. అప్పటికే నా వెనకే ఉన్న అమృత కళ్లల్లో కన్నీళ్లని గమనించాను. నేను వెంటనే 'అమృత లోపలికి వెళ్ళి అమ్మనడిగి ఐదువేలు తీసుకొచ్చి వాళ్లకి ఇవ్వు' అన్నాను.

ఆ మాటతో అమృత ముఖంలో వర్ణనాతీతమైన ఆనందం వెల్లివిరిసింది. అమృత నా వైపు ఆరాధనా భావంగా చూసింది. నేను చిన్నగా నవ్వి లోపలికి వచ్చేశాను.

అమృత వాళ్ళకి డబ్బిచ్చి పంపించేసింది.

* * *

ఆ రోజు సోమవారం. అమృత పుట్టినరోజు. నేను మార్నింగ్ వాక్‌కి వెళ్లొచ్చిన తర్వాత అమృతకి విషెష్ చెబుదామని ఉత్సాహంగా తన రూమ్‌కి వెళ్ళాను. అమృత రూంలో లేదు. తిరిగి నేను హాల్లోకొచ్చేసరికి సంధ్య టీ కప్పుతో నుంచొని ఉంది. నేను టీ కప్పు అందుకుంటూ 'అమృత రూంలో లేదు. ఇంత ప్రొద్దుటే ఎక్కడికెళ్లిందంటావ్' అన్నాను.

'ఏమోనండి? మీకంటే ముందుగా నేనే విషెష్ చెబుదామని తన రూంకి వెళ్ళాను. అప్పటికే లేదు. బహుశా ఏ గుడికో వెళ్లుంటుంది' అని సంధ్య లోపలికి వెళ్ళిపోయింది. అమృత చెప్పకుండా బయటికెళ్ళడం ఇదే మొదటిసారి. నాకు ఆశ్చర్యమనిపించింది. ఈ రోజు ఆఫీసుకి వెళ్ళకుండా అమృతతోటే గడుపుదామనుకున్నాను. కానీ నన్ను పూర్తిగా అప్‌సెట్ చేసేసింది. ఆఫీసుకి వెళ్లబుద్ధికాక ఇంటి దగ్గరే ఉండిపోయాను.

* * *

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటినా అమృత రాలేదు. చాలాసార్లు తన మొబైల్‌కి ట్రై చేశాను. స్విచాఫ్ చేసి ఉంది. ఏమీ పాలుపోక హాల్లో అటూ ఇటూ పచార్లు చేస్తుండగా ల్యాండ్ ఫోన్ రింగయింది. ఫోన్ రింగ్ వినపడటంతో అమృత చేసుంటుందనుకొని సంధ్య ఆతృతగా బయటికొచ్చింది.

నేను ఫోన్ రిసీవ్ చేసుకున్నాను. అవతల అమృత స్నేహితురాలు పద్మిని. 'అంకుల్ మేమంతా హోటల్ సవేరా దగ్గర వెయిట్ చేస్తున్నాం. అమృత ఇంకా రాలేదు. తన సెల్ స్విచాఫ్ చేసి ఉంది. అందుకే మీకు ఫోన్ చేశాను. అంకుల్ త్వరగా మీరిద్దరూ బయలుదేరి రండి' తిరిగి నేను సమాధానం చెప్పకుండానే అవతల లైన్ కట్టయింది.

'ఎక్కడ్నుంచండీ ఫోన్? అమృత చేసిందా?' అంది సంధ్య. 'కాదు. అమృత ఫ్రెండ్ పద్మిని చేసింది. అమృత హోటల్‌క్కూడా వెళ్లలేదట' విషయాన్ని చెప్పాను. అంతవరకూ నిబ్బరంగా వున్న సంధ్యలో కంగారు మొదలయ్యింది. 'ఏవండీ, అసలే రోజులు బాగాలేవు. నాకెందుకో కంగారుగా ఉందండి? మీరెళ్ళి చూసి రండి' అంది. సంధ్య గొంతు ఆందోళనతో వొణికింది.

క్షణక్షణానికి నాలో కూడా టెన్షన్ పెరుగుతూనే ఉంది. కాళ్లు చేతులు ఆడటంలేదు. నేను బయటపడకుండా 'అదేం చిన్నపిల్ల కాదు కదా. వస్తుందిలే' అని సంధ్యని సముదాయించి రెండు నిమిషాలు ఆలోచించిన తర్వాత 'మన వాచ్‌మెన్ రంగయ్యని అడిగితే విషయం ఏమైనా తెలియొచ్చు' అని రంగయ్యని కేకేశాను.



**దేవుడి దయవల్ల వాళ్లకి ఏ విధమైన హాని జరగలేదు డాడీ! వాళ్లని ఆ స్థితిలో చూసేసరికి నాకు జాలేసింది. అందుకే వాళ్ళని ఆదుకోవాలనిపించింది. నా బర్త్‌డే పార్టీకని మీరిచ్చిన ఆ లక్ష రూపాయల్లో ఆ పిల్లోడికి ఆపరేషన్ చేయించాను.**

రంగయ్య వచ్చి నా ముందు నిలబడ్డాడు. విషయం చెప్పాను.

నా మాటలకి బదులుగా రంగయ్య 'ఈ రోజు అమ్మతమ్మగారి పుట్టిన రోజట కదండీ. నాకు పొద్దుటే స్వీటిచ్చారండి. మాట వరసకి 'ఇంత పొద్దుటే ఎక్కడికి బయలుదేరారమ్మ' అని అడిగానండి. 'రంగయ్యా నేను ముఖ్యమైన పని మీద బయటకెళ్తున్నాను. సాయంత్రం వరకూ రాను' అని చెప్పి అమృతమ్మగారు వెళ్లిపోయారయ్యా' అని చెప్పాడు.

ఆ మాటతో మా ఇద్దరిలో టెన్షన్ తగ్గింది. రిలీఫ్‌గా నిట్టూర్పు విడిచింది సంధ్య. 'సరేలే రంగయ్య నువ్వెళ్లి పని చూసుకో' అని రంగయ్యని పంపేశాను.

'ఒక ఫోన్ చేసి చెప్తే దాని సొమ్మేంపోతుంది. మనకీ కంగారుండదు కదా? రానివ్వండి. దానిపని చెప్తాను' అంటూ కోపంగా లోపలికి వెళ్లిపోయింది సంధ్య. నేను రిలాక్స్‌గా దినపత్రిక తిరగేస్తూ సోఫాలో కూర్చుండిపోయాను.

* * *

సాయంత్రం ఆరు గంటలు కావస్తుండగా అమృత వచ్చింది. అమృతని చూడగానే నా ప్రాణం లేచి వచ్చింది. అమృతకి నవ్వుతూ ఎదురెళ్ళి బర్త్‌డే విషెష్ చెప్పి ఆప్యాయంగా తన నుదుటిపై ముద్దు పెట్టుకున్నాను. 'థాంక్యూ డాడీ' అంటూ నన్ను హత్తుకుపోయింది.

'సారీ డాడీ... నేను ఉదయాన్నే ఎక్కడికెళ్ళానంటే...' అంటూ ఏదో చెప్పబోయింది. ఆ మాట పూర్తి కాకుండానే 'వచ్చావా! పొద్దుట్నుంచీ ఎక్కడికెళ్ళావే. మేం ఎంత కంగారు పడ్డున్నామో నీకు తెలుసా?' అంటూ అమృతపై అరిచింది సంధ్య. సంధ్య ముఖంలో నేనెప్పుడూ అంత కోపం చూడలేదు.

అమృత హడలిపోయింది. అంతవరకూ నవ్వుతూ ఉన్న అమృత ముఖం పాలిపోయింది. నేను ఆలస్యం చేయకుండా సంధ్య మాటలకి అడ్డుపడ్డాను. 'సంధ్య నువ్వూరుకో. నేను మాట్లాడతాను కదా' అంటూ సంధ్యని గదమాయించాను. సంధ్య మారు మాట్లాడకుండా నిశ్శబ్దంగా అక్కడే నుంచుండిపోయింది.

వాతావరణాన్ని తేలిక చేయాలనుకొని, నేను నవ్వుతూ అమృతతో 'ఏరా మమ్మీ ఉదయాన్నుంచి ఎక్కడికి వెళ్లావురా. ఆఫీసుకి వెళ్ళకుండా నీ కోసమే ఎదురుచూస్తూ కూర్చున్నాను తెలుసా' అంటూ సౌమ్యంగా అడిగాను.

నా మాటలకి బదులుగా అమృత 'డాడీ... మొన్న ఒకావిడ చిన్నపిల్లాడితో మనింటికొచ్చింది. మీకు గుర్తుందా?' అంటూ నాకు పాత సంఘటనని గుర్తుచేసింది.

'అవునమ్మా! నాకు గుర్తుంది. ఆ పిల్లాడికి ఊపిరితిత్తుల్లో ఏదో ప్రాబ్లెం ఉందంటే, ఆపరేషన్ కోసం డబ్బిచ్చి పంపాం కదా' అన్నాను.

'అవును డాడీ! వాళ్లే... పాపం దిక్కుమొక్కులేని అనాధలు. ఆ ఆపరేషన్‌కి సరిపడా డబ్బులు పోగవలేదట. డబ్బు పూర్తిగా జమ చేయకపోతే ఆపరేషన్ చేయమని చెప్పి బయటకు పొమ్మన్నారంట డాక్టర్లు. ఆవిడ చాలాసేపు కాళ్లావేళ్లా పడి బతిమలాడినా, ఆ డాక్టర్ల మనసు కరగలేదట. పాపం... అందుకే వాళ్ళిద్దరూ ఆత్మహత్యకి పాల్పడ్డారు' అని చెప్పి మౌనంగా ఆగిపోయింది అమృత.

ఆ మాటతో నా గుండెల్లో పిడుగు పడ్డయ్యింది. నేను ఆతృతగా 'ఏమ్మా!... వాళ్ళు ఇప్పుడు క్షేమమే కదా' అన్నాను.

అమృత చిన్నగా నవ్వి 'ఆ దేవుడి దయవల్ల వాళ్లకి ఏ విధమైన హాని జరగలేదు డాడీ! వాళ్లని ఆ స్థితిలో చూసేసరికి నాకు జాలేసింది. అందుకే వాళ్ళని ఆదుకోవాలనిపించింది. నా బర్త్‌డే పార్టీకని మీరిచ్చిన ఆ లక్ష రూపాయల్లో ఆ పిల్లోడికి ఆపరేషన్ చేయించాను. ఉదయాన్నుంచి హాస్పిటల్ దగ్గరే ఉన్నాను. ఆపరేషన్ సక్సెస్ అయింది. ఆ పిల్లోడి బతికి బయటపడ్డాడు. ఇప్పుడు నాకు చాలా ఆనందంగా ఉంది డాడీ! ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టేనన్న తృప్తి నాకు మిగిలింది. నేను చేసింది మంచి పనే కదా డాడీ?' అంటూ నన్ను అమాయకంగా ప్రశ్నించింది అమృత.

ఆ మాటతో నా అణువణువూ పులకించింది. ఆనందంతో నా కళ్లు చెమర్చాయి. ఏవో తెలియని భావోద్వేగాలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. మానవత్వం మూర్తీభవించిన అమృతమూర్తిలా కనిపించింది అమృత నా కంటికి. ఆప్యాయంగా నా గుండెలకి హత్తుకోవాలనిపించింది.

అంతవరకూ నిశ్శబ్దంగా నుంచొని మా మాటలు విన్న సంధ్య నాకంటే ముందుగా స్పందించింది. అమాతంగా అమృతని చుట్టేసుకొని అమృత ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకుని ముద్దులతో ముంచెత్తేసింది.

'అమృతా... విషయం తెలుసుకోకుండా అనవసరంగా నీ మీద కోప్పడ్డాను. నన్ను క్షమించరా! ఎంత మంచిపని చేశావురా నువ్వు. వయసులో చిన్నదానివైనా వ్యక్తిత్వంలో ఎవరికీ అందనంత ఎత్తుకి ఎదిగావు. నిన్ను కన్నందుకు మేం గర్వపడేలా చేశావు. థాంక్యూ రా...' అంటూ అమృత నుదుటిపై గాఢంగా ముద్దుపెట్టి తన హృదయానికి హత్తుకుంది సంధ్య. సంధ్య కళ్ళల్లో ఆనందభాష్పాలు. **(మిగతా 21వ పేజీలో)**



# ధర్మ సందేహాలు

మధుర కృష్ణమూర్తి శాస్త్రి

సి.రామశర్మ (పురోహితుడు)

*ప్ర: 1.సూర్యునకు సాధారణ నామములు, విశేష నామములు కలవని విన్నాం. పండితులను అడిగినా విశేష నామాలు తెలియవంటున్నారు. ఉంటే తెలుపగోర్తాము.*

జ: సూర్యుని సాధారణ నామములు 12 కలవు. విశేష నామములు 12 కలవు. 1.ఆదిత్య 2.సవిత 3.సూర్య 4.మిహిర 5.అర్క 6.ప్రతాపన 7.మార్తాండ 8.భాస్కర 9.భాను 10.చిత్రభాను 11.దివాకర 12.రవి సాధారణములు 1.విష్ణువు 2.ధాత 3.భగ 4.పూష 5.మిత్ర 6.ఇంద్ర 7.వరుణ 8.అర్యమ 9.వివస్వాన్ 10.అంశుమాన్ 11.త్వష్ట 12.పర్జన్య విశేష నామములు.

జయంతి శశికళ (జ్యో.విద్యార్థి)

*ప్ర: గోచారమునకు జాతకానికి గల సంబంధమును ఏ విధముగ విచారించాలి. దశాఫల విచారణకు తగిన గ్రంథాన్ని సూచిస్తారా?*

జ: వర్తమాన దశాంతర్దశలు జాతకరీత్యా ఏవి జరుగుతున్నాయో ఆ గ్రహాలు గోచారరీత్యా శుభాలుగా వుంటే శుభాన్ని, పాపులుగ వుంటె పాపాన్ని ఇస్తారు. దశానాధ రాశిని లగ్నంగా గ్రహించి కూడ దశాంతర్దశాఫలాన్ని చెప్పాలి. గోచర - అష్టకవర్గ సహాయముతో దశాంతర్దశా ఫలాలకు నిర్ణయించాలి. ఫలదీపిక - ఉత్తరకాలామృతం వంటి గ్రంథాలలో విశేష చర్చ చూడగలరు.

పేరి రామచంద్రుడు, ఎం.ఎస్.పల్లి

*ప్ర: నేను హృదయవ్యాధితో బాధపడుతున్నాను. దీని నివారణకు ఏదైనా శాంతిని తెలుపగోరుతున్నాను. రకరకాలుగా చెప్పుటచే సందేహము తీరుట లేదు.*

జ: సూర్యోపాసన శ్రేష్ఠమని, సౌర పారాయణ వలన మేలు కలుగుతుందని శాస్త్రము. అరసవిల్లి సూర్యదేవాలయంలో తెలుసుకొనుట మంచిది.

అర్.కృష్ణప్రసాద్, విజయవాడ

*ప్ర: ఆబ్దికము పెట్టు తిథికి అశౌచం వస్తే ఆబ్దికం ఎప్పుడు పెట్టాలి?*

జ: అశౌచము శుద్ధి ఏ రోజున అగునో ఆ రోజున పెట్టవలెను.

ఎన్.సూర్యకుమారి, అమలాపురం

*ప్ర: ఈనాడు అన్ని విధాల జ్యోతిషానికి విలువ, ప్రచారం పెరిగాయి. ఎందువలన?*

జ: ప్రజలలో దురాశ పెరగడం ముఖ్య కారణం. భయం రెండవ కారణం.

నేమాని రమణ, శంకరపురం

*ప్ర: మేషాది ద్వాదశ సూర్యసంక్రాంతులను రాసేటప్పుడు, విషువత్, హరిపద, షడశీతి పుణ్యకాలాలని రాస్తారు. అంటే ఏమిటి?*

జ: చరరాశులగు మేష - తుల సంక్రాంతులకు విషువత్తులని, కర్కటక - మకర సంక్రాంతులకు దక్షిణోత్తరాయనములని, స్థిరరాశులగు వృష - సింహ - వృశ్చిక - కుంభ సంక్రాంతులకు విష్ణు పదము లేక హరిపదములని, ద్విస్వభావ రాశులగు మిథున, కన్య ధనుర్మీన సంక్రాంతులకు షడశీతులని సంజ్ఞలు కలవు. ఇవి విశేష పుణ్యప్రదములు. పితృదేవతా ప్రీతికరములైన కర్మలకు చేయవలెను. ★

ఈ శీర్షికలో ఆచారాలు, సంప్రదాయాలు, జ్యోతిషం, వాస్తు, ఆధ్యాత్మిక విషయాలపై ప్రశ్నలు అడగవచ్చు. ఈ కింది కూపన్‌లో రాసే ప్రశ్నలకు మాత్రమే సమాధాన మిస్తారు.

**ధర్మసందేహాలు**

పేరు:........................................................ఊరు........................

చిరునామా..................................................

..................................................................................

ప్రశ్న:...............................................................

..................................................................................

..................................................................................

ప్రశ్నలు పంపాల్సిన చిరునామా :

ఎడిటర్ ,

ఆదివారం అనుబంధం, ఆంధ్రభూమి దినపత్రిక,

36 సరోజినీదేవీ రోడ్, సికిందరాబాద్-500003

(8వ పేజీ తరువాయి)

వాళ్ళిద్దర్ని అలా చూసేసరికి నేను అవ్యక్తమైన అనుభూతికి లోనయ్యాను. ఇంత ఉన్నతమైన భావాలుకల అమృతకి జన్మనిచ్చినందుకు మేం నిజంగా అదృష్టవంతులమే. ఉద్వేగంతో నా నోటి వెంట మాట రాక మౌనంగా ఉండిపోయాను. కొంత సమయం హాలంతా నిశ్శబ్దమై పోయింది.

ఆ నిశ్శబ్దాన్ని తొలగిస్తూ అమృత గొంతు పలికింది.

'డాడీ... మనలా ఉన్నవాళ్లంతా ఈ సొసైటీలో ప్రెస్టేజ్‌ని పెంచుకోవడం కోసం సెలబ్రేషన్స్ పేరు చెప్పి పార్టీల రూపంలో పోటీపడి డబ్బుని ఖర్చు పెట్టేబదులు, లేశమాత్రంగానైనా పేదవాళ్ళకి ఖర్చు పెడితే... ఈ దేశంలో పేదరికం నిలిచి ఉంటుందంటారా?' అంటూ నన్ను ప్రశ్నించింది అమృత.

ఆ ప్రశ్న నా హృదయాంతరాళాల్లోకి దూసుకెళ్ళింది. అమృత అన్న మాటలు అక్షరసత్యాలు. నేను ఆలోచనలో పడ్డాను. బాగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకున్నాను.

'మమ్మీ... నీ పుట్టినరోజు సందర్భంగా నీకు నేను ఇస్తున్న బహుమతి ఏంటో తెలుసా?' అన్నాను. 'ఏంటీ డాడీ...' అంది కుతూహలంగా అమృత. 'ముందు మీ ఇద్దరూ అలా సోఫాలో కూర్చోండి' అంతవరకూ నిలబడే వున్న వాళ్లతో అన్నాను. ఇద్దరూ సోఫాలో కూర్చున్నారు. వాళ్లకెదురుగా నేనూ కూర్చున్నాను.

'అమృతా... నీ ఆలోచన్లు నన్ను కదిలించాయి. నిస్సహాయుల పట్ల నువ్వు చూపిస్తున్న ఔదార్యం అనిర్వచనీయం. నీ అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను.

అవసరానికి మించి ఆస్తులు కూడబెట్టుకొని, వాటిని అనుభవిస్తూ, హాయిగా గడపటమే జీవితం అనుకున్నాను. కానీ, నా ఆలోచనలు స్వార్థంతో కూడుకున్నవని నీవల్లే నాకు తెలిసింది. అందుకే నీ ఉన్నతమైన ఆశయాలకి నేను ఆదర్శంగా నిలవాలనుకుంటున్నాను.

ప్రతి సంవత్సరం నీ పుట్టిన రోజునాడు మన బిజినెస్‌లో వచ్చే లాభంతో యాభై శాతాన్ని పేద ప్రజల ఉన్నతి కోసం వెచ్చించాలని నిర్ణయించాను. ఈ సంవత్సరానిగ్గానూ, మన మురికివాడలో వున్న పేదవాళ్లతో ఈ కార్యక్రమాన్ని రేపే ప్రారంభిద్దాం. సరేనా...' అని రెండు క్షణాల తర్వాత 'మమ్మీ... ఎలా ఉందిరా నా పుట్టినరోజు బహుమతి' అన్నాను.

ఆ మాటతో అమృత ముఖంలో వర్ణనాతీతమైన ఆనందంతో వెలిగిపోయింది. 'మాటలతో వర్ణించలేనంత గొప్పగా ఉంది డాడీ మీ బహుమతి. థాంక్యూ వెరీ మచ్...' అంటూ నన్ను చుట్టేసుకుపోయింది అమృత.

కోట్లకి పడగలెత్తిన అపర కుబేరులంతా నా కూతురు అమృతలాగే ఆలోచిస్తే ఎంత బాగుంటుందో.

మనిషిగా ఈ సమాజంలో ఎంతో ఎత్తుకి ఎదిగాను. కానీ, మానవత్వం ఉన్న మనిషిగా ఎదగడానికి ఇన్నేళ్లు పట్టినందుకు సిగ్గుపడ్తున్నాను. ఇప్పటికైనా మారినందుకు ఆనందపడ్తున్నాను.

నా మనసు తృప్తితో నిండిపోయింది. చేయవలసిన మంచి పనికి ఇంకా ఎన్ని గంటలు వేచి ఉండాలా అన్నదే ఇప్పుడు నా దిగులంతా?


రచయిత చిరునామా

గంటా కళ్యాణీనాయుడు

శ్రీ అయ్యప్ప మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్

మఠం వీధి,

పాలకొల్లు - 534 260.

ప.గో.జిల్లా